క్లుప్తంగా

జాగ్రత్తలు పాటించాలి



బీమారం వంతెనను పరిశీలిస్తున్న ఎస్పీ

సూర్యాపేట : వర్షాల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ సూచించారు. మూసి నదిలో వరద ఉధృతి దృష్ట్యా జిల్లా ఎస్పీ నర్సింహ మంగళవారం సూర్యాపేట రూరల్ పరిధిలోని ఎదురువారి గూడెం – బీమారం వంతెన వద్ద మూసీ నది ప్రవాహాన్ని రూరల్ సీఐ రాజశేఖర్, మూసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రవాహ ఉధృతి ఉన్న నీటిలోకి దిగొద్దని, లోతు ఎక్కువగా ఉన్న నీటిలోకి వెళ్లొద్దని, చేపల వేటకు వెళ్లొదన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ నంబర్ 8712686026కు ఫోన్ చేసి పోలీసు సేవలు పొందాలని పేర్కొన్నారు.

ఫార్మా కంపెనీల్లో తనిఖీ



ఫార్మా కంపెనీని తనిఖీ చేస్తున్న అధికారులు

చివ్వెంల : సూర్యాపేట మండలం శాంతి నగర్ గ్రామ శివారులోని కోహన్స్ ఆఫ్ సైన్సెస్ (సువెన్ ఫార్మా), చివ్వెంల మండల కేంద్ర శివారులోని రావుస్ ఫార్మా కంపెనీలను మంగళవారం వివిధ శాఖల అధికారులు తనిఖీ చేశారు. ఆయా కంపెనీల్లో అగ్నిమాపక, భద్రతా, కాలుష్య నివారణ, కార్మికులకు సంబంధించిన వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయా కంపెనీల్లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇండస్ట్రీస్ జీఎం తేజావత్ సీతారాం, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, జిల్లా అగ్నిమాపక అధికారి వై.క్రిష్టారెడ్డి, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ అరుణ, కంపెనీ ప్రతినిధులు ఎం.రమేష్‌బాబు, మేనేజర్ బి.వెంకటరమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తెస్తాం



వ్యాపారులతో మాట్లాడుతున్న వేణారెడ్డి

భానుపురి : సూర్యాపేట పాత మార్కెట్‌లో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వ్యాపారుల సూచనల మేరకు వినియోగంలోకి తీసుకురానున్నట్లు మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మార్కెట్ కార్యాలయంలో కూరగాయలు అమ్మే వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంతో ఆర్భాటంగా జాతీయస్థాయిలో నిర్మాణం అంటూ ప్రచారం చేసుకొని కట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఎందుకు పనికిరాకుండా పోయిందన్నారు. మార్కెట్‌ను అందరికీ ఉపయోగపడే విధంగా మార్చడానికి కూరగాయల వ్యాపారుల సలహాలు తీసుకుంటున్నామని, తప్పనిసరిగా మరొకసారి సమావేశమై అందరి సలహా మేరకు వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ ఫసియొద్దీన్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

15న గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన

భానుపురి : ఈ నెల 15న సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూతనంగా జిల్లా గ్రంథాలయ భవనం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు తెలిపారు. మంగళవారం జిల్లా గ్రంథాలయంలో శంకుస్థాపన జరిగే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 1. 50 కోట్ల వ్యయంతో సుమారు 700 గజాల స్థలంలో కమ్యూనిటీ హాల్, కార్యాలయం, బుక్స్ స్టోరేజ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరవుతారని చెప్పారు. సమావేశంలో లైబ్రేరియన్ శ్యాంసుందర్ రెడ్డి, రంగారావు, భాస్కర్, కిషోర్ , జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు కర్నాటి కిషన్, ప్రస్తుత అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బండారు రాజా, కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, ఉపాధ్యక్షులు తప్పీ గాంధీ, కక్కిరేణి చంద్రశేఖర్, కొత్త మల్లికార్జున్ ,పేరూరి అశోక్, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాకొళపు రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

- నిండిన చెరువులు, కుంటలు
- రహదారులపై వరద ఉధృతికి రాకపోకలకు ఇబ్బందులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ఈ వర్షంతో చెరువులు, కుంటలు నిండి పొంగిపొర్లాయి. ముఖ్యంగా, తిరుమలగిరి మున్సిపాలిటీలోని 19వ వార్డులో ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తొండ గ్రామం వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా ప్రత్యామ్నాయంగా వేసిన మట్టి రోడ్డు వరద నీటిని అడ్డుకోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో రోడ్డు పక్కన ఉన్న ఇళ్లు, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోకి నీరు చేరింది. అంగన్‌వాడీ పాఠశాలలో వస్తువులు పూర్తిగా తడిసిపోయాయి. అలాగే, గుండెపురి, బండ రామారం మధ్య ఉన్న ప్రధాన రహదారిపై వరద ఉధృతంగా ప్రవహించడంతో ఉదయం రాకపోకలు నిలిచిపోయాయి. వెలిశాల గ్రామంలో ఎస్సారెస్పీ కాలువలోకి వరద నీరు చేరి కాలువ లైనింగ్ దెబ్బతింది. చౌళ్ల తండాలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు కూడా నీట మునిగాయి. గుండెపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాయిలెట్లు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. తాటిపాముల, నందాపురం, అనంతారం గ్రామాల గుండా వెళ్లే బిక్కేరు వరద ప్రవాహంతో పొంగిపొర్లింది.

అర్వపల్లి : సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అర్వపల్లితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. గుట్ట నుంచి ఉధృతంగా వచ్చిన వరద నీరు అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలను చెరువులుగా మార్చింది. సూర్యాపేట–జనగామ 365బీ హైవేలో భాగమైన అర్వపల్లి పోలీస్ స్టేషన్ రోడ్డు పూర్తిగా నీట మునిగింది. సుమారు 50కి పైగా ఇళ్లు జలమయం కావడంతో స్థానికులు నష్టపోయారు. గ్రామంలోని సంత ఆవరణ కూడా వరద నీటితో నిండిపోయింది.



తిరుమలగిరి : అలుగుపోస్తున్న మాలిపురం చెరువు



తిరుమలగిరి : గుండెపురిలోని పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు



నాగారం : పసునూర్‌లో అలుగుపోస్తున్న పెద్ద చెరువు



నాగారం : వర్ధమానుకోటలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

కోడూరు–తిమ్మాపురం రహదారిపై చెరువు అలుగు పోయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండల వ్యాప్తంగా చెరువులు అలుగు పోస్తున్నాయి. కేజీబీవీలో చిక్కుకున్న 60 మంది బాలికలను తహసీల్దార్ భాషపాక శ్రీకాంత్ చొరవ తీసుకొని, ట్రాక్టర్ ఏర్పాటు చేయించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం వారిని వారి ఇళ్లకు పంపించారు.

తుంగతుర్తి: మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగిపొర్లుతున్నాయి. పలు గ్రామాల్లో చెరువులు అలుగు పోస్తున్నాయి.

నూతనకల్ : ఎగువ ప్రాంతాల్లో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని గుండ్లసింగారం రెవెన్యూ పరిధిలోని ఏపూరు ఆనకట్ట పొంగి ప్రవహిస్తోంది. వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి నీటి ప్రవాహాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై ఉన్న గుండ్లసింగారం బ్రిడ్జిపై నుంచి వర్షపు నీరు ప్రవహిస్తోంది. వరద ఉధృతికి చెత్తాచెదారం కొట్టుకువచ్చి నీటి ప్రవాహానికి అడ్డుగా నిలవడంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి జేసీబీ సహాయంతో చెత్తను తొలగించారు.

ఉప్పొంగిన బిక్కేరు వాగు

ఆత్మకూర్ (ఎస్) : సోమవారం రాత్రి కురిసిన వర్షంతో మండలంలోని పలు గ్రామాల చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. నెమ్మికల్ చౌట చెరువు, నసీంపేట చెరువుతోపాటు పలు గ్రామాల చెరువులు అలుగు పోస్తున్నాయి. మండలంలోని ఏపూరు వద్ద బ్రిడ్జిపై నుంచి బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజల రాకపోకలను నిలిపివేశారు.

నాగారం : మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలోనే అత్యధిక వర్షపాతం నాగారం మండలంలో 190.3 మి.మి వర్షపాతం నమోదైంది. ఫణిగిరి, పసునూర్, పస్తాల, లక్ష్మాపురం, వర్ధమానుకోట, నాగారం, డి.కొత్తపల్లి, ఈటూరు గ్రామాల్లోని చెరువులు నీటితో నిండి ఉధృతంగా అలుగుపోస్తున్నాయి. అలాగే వర్ధమానుకోటలోని బిక్కేరువాగు అలుగుపోస్తోంది. పస్తాల, లక్ష్మాపురం, డి.కొత్తపల్లి గ్రామాల్లో కల్వర్టులు ప్రమాదకంగా మారాయి. వరద తాకిడికి నాగారం–తుంగతుర్తి ప్రధాన రహదారి వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

అలుగుపోస్తున్న చెరువులు, కుంటలు

మద్దిరాల : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కుక్కడం, గుమ్మడవెల్లి, పోలుమల్ల, చిన్ననెమిల, కుంటపల్లి గ్రామాల చెరువులు మంగళవారం అలుగుపోస్తున్నాయి. అదే విధంగా పలు కాలనీలలో ఇళ్ల చుట్టూ నీళ్లు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



మద్దిరాల : గుమ్మడవెల్లిలో అలుగుపోస్తున్న చెరువు



మద్దిరాల : కుక్కడంలో చెరువులోకి వెళ్తున్న వరద



ఆత్మకూర్(ఎస్) : ఏపూరు వద్ద బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద



అర్వపల్లి : కోడూరులో రహదారిపై ప్రవహిస్తున్న వరద



తిరుమలగిరి : వెలిశాలలో దెబ్బతిన్న ఎస్సారెస్పీ కాల్వ లైనింగ్



అర్వపల్లి : జలమయమైన అర్వపల్లిలోని జాతీయ రహదారి

ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి

భానుపురి: డీటీఓతోపాటు కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి ఎస్‌టీఓ కార్యాలయాల పరిధిలో 75 ఏళ్లు నిండిన పెన్షనర్లు ఆధార్, పాన్, పీపీఓఐడీ జిరాక్స్‌లు, పాస్ పోర్ట్ సైజు ఫొటోతో ఆయా కార్యాలయాలకు విధిగా హాజరు కావాలని జిల్లా ట్రెజరీ అధికారి రవి కుమార్ తెలిపారు. హాజరుకాకపోతే ఈ నెల పెన్షన్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

142కిలోల గంజాయి నిర్వీర్యం

సూర్యాపేటటౌన్ : జిల్లాలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 15 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 142 కిలోల గంజాయిని ప్రభుత్వం, కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం యాదాద్రి జిల్లాలో గల తుక్కాపుర్‌లోని రోమా ఇండస్ట్రీస్‌లో నిర్వీర్యం చేసినట్లు డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఎస్పీ నరసింహ తెలిపారు. యాజమాన్యం, సిబ్బంది సహాయంతో ప్రభుత్వ సాక్షుల సమక్షంలో గంజాయిని నిర్వీర్యం చేసినట్టు చెప్పారు. డ్రగ్స్ అమ్మకం, రవాణా, వినియోగానికి సంబంధించి పోలీసులకు, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ హరిబాబు, సిబ్బంది ఉన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్ నాయకుల స్వాగతం



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేట : టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మంగళవారం విజయవాడ వెళ్తున్న సందర్భంగా పట్టణంలోని హోటల్ సెవెన్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనకు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్ గౌడ్, డీసీసీ కార్యదర్శి నాగుల వాసు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు జావీద్ బెగ్, చెంచల నిఖిల్, బొజ్జా సంజయ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ భూక్యా శివ నాయక్, ఖమ్మంపాటి మధు, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

సహాయక శిబిరం

తిరుమలగిరి : తొండ గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వరద రావడంతో పలువురి ఇళ్లలోకి నీళ్లు చేరి వస్తువులన్నీ తడిసాయి. దీంతో బాధితులకు మంగళవారం తహసీల్దార్ హరిప్రసాద్ ప్రత్యేక సహాయక శిబిరం ఏర్పాటు చేయించారు. వారికి భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, కార్యదర్శి యాకూబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సూర్యాపేట : మార్క్సిస్టు మేధావి, సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి దేశం గర్వించదగ్గ వ్యక్తి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ములకలపల్లి రాములు అన్నారు. మంగళవారం సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లౌకిక విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ ఐక్యత కోసం పరితపించిన నాయకుడు అని కొనియాడారు. సీతారాం ఏచూరి ఆశయ సాధనకు మనందరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవిందు, మేకనబోయిన శేఖర్, వేల్పుల వెంకన్న, జిల్లేపల్లి నరసింహారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ఎలుగూరి జ్యోతి, నాగమణి, రవి పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న ప్రాంతాల పరిశీలన



సూర్యాపేట అర్బన్ : నాలాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి



నాగారం : డి.కొత్తపల్లిలో చెరువు గండిని పరిశీలిస్తున్న అధికారులు

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట పట్టణంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి మంగళవారం ఉదయం ముంపు ప్రాంతాలు, నాలాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ, ప్రియాంక కాలనీ, ఆర్‌కే గార్డెన్, శ్రీరామ్ నగర్, తిరుమల నగర్ వంటి ముంపునకు గురైన ప్రాంతాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలానికి ముందే పట్టణంలోని ప్రధాన నాలాలు, బాక్స్ టైపు డ్రెయిన్‌లలో పేరుకుపోయిన పూడికను తొలగించామని తెలిపారు. దీనివల్ల సద్దుల చెరువుకట్ట, పిల్లలమర్రి, తిరుమల నగర్ నుంచి పుల్లారెడ్డి చెరువుకు వచ్చే వరద నీరు ఎలాంటి అడ్డంకులు లేకుండా సాఫీగా ప్రవహిస్తోందని చెప్పారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, వార్డు అధికారులకు తగు సూచనలు చేశారు. తమ పరిధిలోని వార్డులలో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, యాదగిరి తదితరులు ఉన్నారు.

అర్వపల్లి : భారీ వర్షానికి జలమయమైన అర్వపల్లిలోని కేజీబీవీ, లోతట్టు ప్రాంతాలను మంగళవారం వివిధ శాఖల అధికారులు సందర్శించారు. సందర్శించిన వారిలో నీటి పారుదలశాఖ ఎస్ఈ శివధర్మతేజ, డీఈఈ అశోక్, ఆర్డీఓ వేణుమాధవరావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ గోపి, ఎస్ఓ నాగరాణి, ఎస్ఐ సైదులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

చెరువు గండి పరిశీలన

నాగారం : డి.కొత్తపల్లి గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గ్రామంలోని పెద్ద చెరువు అలుగు వద్ద గండి పడింది. దీంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఇరిగేషన్ శాఖ ఏఈఈలు అనిత, నవీన్ చెరువుగండిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు గండిని పూడ్చేందుకు మరమ్మతులు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యారాల నర్సింహారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలి



అర్వపల్లిలో కేజీబీవీని సందర్శించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్



తిరుమలగిరి : తొండ గ్రామంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



సూర్యాపేట : జలమయమైన ప్రాంతాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

తిరుమలగిరి : వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రభావితమైన ప్రాంతాలను ఆయన మంగళవారం పరిశీలించారు. వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. సర్వీస్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్లంల సోమయ్య, యాదమ్మ, వెంకన్న, సురేందర్ ఇళ్లలోకి వెళ్లి తడిసిన ఇంటి సామగ్రిని, అంగన్‌వాడీ కేంద్రంలో తడిసిన వస్తువులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. మంచి నీటిని, నిత్యావసర వస్తువులను అందించాలని కోరారు. మిషన్ భగీరథ పైపులను శుభ్రం చేసి నీటిని పరీక్షించి ప్రజలకు తాగు నీరు అందించాలన్నారు. అప్పటి వరకు ట్యాంకుల ద్వారా తాగు నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ఐదు రోజుల పాటు హెల్త్ క్యాంపులు నిర్వహించి ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేయాలన్నారు. ప్రతి ఇంట్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, సహాయక శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. బియ్యం తడిసిన వారందరికీ ఉచితంగా 25 కిలోలు అందజేస్తామన్నారు.

పాఠశాలకు ఎందుకు వెళ్ల లేదు

తొండ గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతంలో కలెక్టర్ పర్యటిస్తుండగా ఇదే గ్రామానికి చెందిన దేవరకొండ రియాన్ అనే బాలుడు అక్కడ ఉండటంతో దగ్గరికి పిలిచారు. ఏ పాఠశాలలో చదువుతున్నావు ? ఏ తరగతి చదువుతున్నావు ? ఎందుకు బడికి వెళ్లలేదని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రాత్రి వర్షం రావడంతో పాఠశాలకు వెళ్లలేదని బాలుడు చెప్పాడు. కలెక్టర్ వెంట తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, ఎంపీడీఓ లాజరస్, ఎంపీఓ భీమ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి యాకూబ్ రెడ్డి, ఆర్ఐలు సుజిత్‌రెడ్డి, జార్జిరెడ్డి ఉన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్‌తో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సంబంధిత అధికారులకు సూచించారు. భారీ వర్షానికి జలమయమైన కేజీబీవీతోపాటు లోతట్టు ప్రాంతాల ఇళ్లను, హైవే రోడ్డును, కల్వర్టును మంగళవారం ఆయన పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ రోడ్డు నుంచి జాజిరెడ్డిగూడెం రోడ్డు వరకు అధికారులతో నడుచుకుంటూ వెళ్లారు. వర్షపు నీరు నిలవకుండా చేపట్టే చర్యలపై వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ యాదగిరి, తహసీల్దార్ భాషపాక శ్రీకాంత్, ఎంపీడీఓ గోపి, ఇరిగేషన్ ఏఈ హరిస్వరూప్, ఏఎంసీ డైరెక్టర్ సైదులు, విద్యార్థి సంఘాల నాయకులు పోలెబోయిన కిరణ్, బొద్రబోయిన సైదులు, బైరబోయిన మహరాజు, మారపాక రాములు, కృష్ణమూర్తి, గిర్దావర్, వెంకట్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట : వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం పట్టణంలో జలమయమైన ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

సూర్యాపేట : దేశవ్యాప్తంగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) నిరంతరం పోరాటాలు చేస్తున్నదని సంఘం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.రాములు తెలిపారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎస్‌టీఎఫ్ఐ 25వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సంఘం పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.యాకయ్య, జిల్లా కోశాధికారి జి.వెంకటయ్య, జిల్లా కార్యదర్శి బి.ఆడం, వెలుగు రమేష్, డి.శ్రీనివాసచారి, ఆర్.శ్రీను, బి.ఆనంద్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

సూర్యాపేటటౌన్: సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ 10 మంది పట్టుబడినట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. పట్టుబడిన వారిని మంగళవారం సూర్యాపేట కోర్టులో హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. మిగతా తొమ్మిది మందికి కలిపి రూ.10,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్ఐ హెచ్చరించారు.

బహుళ జాతి కంపెనీలు వైదొలగాలి

సూర్యాపేట : బహుళ జాతి కంపెనీలు దేశం నుంచి వైదొలగాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు అన్నారు. ట్రంప్, మోదీల విధానాలను వ్యతిరేకిస్తూ ఆయా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య మాట్లాడారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో విదేశీ బహుళ జాతి కంపెనీలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి రవి, నాయకులు దూదిపాల ప్రవీణ్, మహేష్, నవీన్, వినయ్, ఉపేందర్, సంధ్య, పావని, రమ, నవ్య, అఖిల పాల్గొన్నారు.

నీళ్లలో నిలబడి నిరసన

అర్వపల్లి : వర్షాలు కురిసిన ప్రతిసారి కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్ ఆవరణలు జలమయమై విద్యార్థులు ఇబ్బందుల పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం పలువురు విద్యార్థి సంఘాల నాయకులు కేజీబీవీలోని నీళ్లలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా నీళ్లు నిలువకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొద్రబోయిన సైదులు, పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య, స్థానికులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

తిరుమలగిరి : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ కోరారు. వన మహోత్సవం సందర్భంగా మంగళవారం 12, 13 వార్డులలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ జీవన్, అఖిల, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

13, 14న స్పాట్ అడ్మిషన్లు

సూర్యాపేట : పట్టణంలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 13, 14 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీవాణి మంగళవారం తెలిపారు. కళాశాలలో బీఏ(హెచ్ఈసీ), బీకాం (జనరల్ సీఏ), బీఎస్సీ (ఫిజికల్ సైన్స్), బీఎస్సీ (లైఫ్ సైన్స్)కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు జిరాక్స్ సెట్లు, ఆధార్ కార్డు, ఫొటోలు తీసుకొనిరావాలని కోరారు.